క్లుప్తంగా

ఆకులమన్నాడు పీఏసీఎస్ చైర్మన్‌గా పకీర్



గూడూరు: ఆకులమన్నాడు పీఏసీఎస్ చైర్మన్‌గా జంపాన వెంకట పకీర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ వేముల సురేష్ రంగబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు గొరిపర్తి రవికుమార్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఆర్‌బీకే చైర్మన్లు, పీఏసీఎస్ అధ్యక్షులు పాల్గొని పకీర్‌ను అభినందించారు.

బీమా సొమ్ము అందజేత



మచిలీపట్నంటౌన్: 41వ డివిజన్‌కు చెందిన దన్నాన సింహాచలం ఇటీవల మృతి చెందాడు. వైఎస్సార్ బీమా పథకం తక్షణ సాయంగా మంజూరైన రూ. 10 వేలను మృతుడి భార్య తేజస్వికి డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ కిలాని శ్రీను, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భార్య, కుమార్తెల అదృశ్యంపై ఫిర్యాదు

పెడన: తన భార్య, ఇద్దరు కుమార్తెలు కనిపించడం లేదని భర్త పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గూడూరుకు చెందిన బొంతు పృథ్వీరాజ్‌కు బుద్దాలపాలెంకు చెందిన పూలన్‌దేవితో ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు నైనిక (6), సాహితి (3) ఉన్నారు. వంట్లో బాగుండటం లేదని చెప్పి పూలన్‌దేవి తన ఇద్దరు కుమార్తెలతో కలిసి పుట్టింటికి నెల రోజుల కిందట వెళ్లింది. అక్కడే ఉన్న పూలన్‌దేవిని సోదరుడు తిట్టడంతో తన భర్త వద్దకు వెళ్లిపోతానంది. దీంతో సోదరుడు ఈ నెల 22వ తేదీన పూలన్‌దేవిని, ఇద్దరు కుమార్తెలను పెడన బస్టాండులో వదిలి వెళ్లిపోయాడు. గూడూరులోని భర్త పృథ్వీరాజ్ ఇంటికి పూలన్‌దేవి చేరలేదు. దీంతో భర్త పృథ్వీరాజ్ పరిసర ప్రాంతాల్లో, బంధువుల వద్ద విచారణ చేసినా ఫలితం లేదు. భర్త పృథ్వీరాజ్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రవిచంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వంట సామగ్రి, నిత్యావసరాలు అందజేత

పెడన: ఈదుమూడి గ్రామంలో ఇటీవల విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో జరిగిన ప్రమాదంలో సర్వం కోల్పోయిన దుర్గాభవాని కుటుంబానికి సహాయ ఫౌండేషన్ మంగళవారం సాయం అందజేసింది. దుర్గభవాని తన ఇద్దరు పిల్లలతో పూరి గుడిసెలో జీవిస్తోంది. ప్రమాదం జరగడంతో స్థానిక పాఠశాలలో తాత్కాలికంగా నివాసం ఉంటోంది. విషయం తెలుసుకున్న సహాయ ఫౌండేషన్ వారు వంట సామగ్రి, నిత్యావసర సరుకులు, 25 కిలోల బియ్యం, ఆరు జతల దుస్తులు, దుప్పట్లు, కూరగాయలు, రూ.2,500 నగదు అందజేశారు. ఉస్మాన్‌బాషా, లంకిశెట్టి బాలాజీ, రాధాకృష్ణమూర్తి, ప్రసాద్, అమీన్, దుర్గాశంకర్, కల్యాణి, భానుశ్రీ పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి రూ.2.25 లక్షలు సాయం

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండల పరిధి పాపవినాశనానికి చెందిన 23 సంవత్సరాల యువకుడు నెరుసు ఉమాకాంత్ కిడ్నీ మార్పిడి కోసం తెలుగురావుపాలెంకు చెందిన గుత్తికొండ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.2.25 లక్షలు ఆర్థిక సహాయం అందించారు. ఉమాకాంత్‌కి రెండు కిడ్నీలు పాడవడంతో ఆపరేషన్ తప్పనిసరని వైద్యులు చెప్పారు. పేద కుటుంబం కావడంతో తల్లి కిడ్నీ ఇవ్వడానికి ముందుకు వచ్చింది. ఆపరేషన్ నిమిత్తం గుత్తికొండ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు గుత్తికొండ కల్యాణ్ విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి బిల్లు కట్టడంతో మంగళవారం కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేశారు. పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయం అందించిన గుత్తికొండ కల్యాణ్‌కు ఉమాకాంత్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మలేరియాపై అవగాహన అవసరం



బందరులో ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ గీతాబాయి :



ర్యాలీ నిర్వహిస్తున్న చేవేంద్ర పీహెచ్‌సీ వైద్యాధికారి వరప్రసాద్, సిబ్బంది

డీఎంహెచ్‌ఓ గీతాబాయి

మచిలీపట్నంటౌన్: మలేరియా వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జి. గీతాబాయి అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన అవగాహన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ నగరంలోని పలు ప్రాంతాల్లో జరిగింది. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి ఏడాది ఏప్రిల్ 25వ తేదీన ప్రపంచ మలేరియా దినోత్సవం నిర్వహిస్తున్నారని చెప్పారు. మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నిల్వ ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెందుతాయని, నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు దోమతెరలను వాడాలని చెప్పారు. జ్వర సంబంధ వ్యాధులకు ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు ఇస్తున్నారని వివరించారు. జిల్లా మలేరియా అధికారి బి. రామారావు, డీఐఓ శర్మిష్ఠ, ఏఓ సాంబిరెడ్డి, హెచ్ఈ రాజేంద్రకుమార్, ఎంపీహెచ్ఈఓ సుకుమార్, మురళి, మోహనరావు, ఎంపీహెచ్ఎస్ రాఘవేంద్రరావు, సుభాషిణి, ఏఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

పెడన: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరమవుతాయని పీహెచ్‌సీ వైద్యాధికారులు అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పెడన పీహెచ్‌సీ, చేవేంద్ర పీహెచ్‌సీల పరిధిలో వైద్యాధికారులు, సిబ్బంది వేర్వేరుగా ర్యాలీలు నిర్వహించారు. పెడన, చేవేంద్ర పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ పర్వేజ్ హైదర్, డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ మంచినీటి నిల్వ ఉంచడం వల్ల అనాఫిలిస్ దోమ పుడుతుందని, ఈ దోమ వల్ల మలేరియా వ్యాప్తి చెందుతుందన్నారు. మంచినీటి నిల్వ ఉంచే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మురుగునీటి నిల్వ ఉండే ప్రాంతాల్లో క్యూలెక్స్ దోమల వల్ల బోధ వ్యాధి, తదితర వ్యాధులు వ్యాపిస్తాయని చెప్పారు. ఇంటి పరిసరాలలో చిన్న చిన్న నీటి నిల్వలలో ఎడిస్ దోమ ఉంటుందని, వీటి ద్వారా అనేక వ్యాధులు వ్యాప్తి చెందుతాయని వివరించారు. వీటి నివారణకు ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జ్వరాలను అశ్రద్ధ చేయరాదని, వెంటనే వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో కానీ పీహెచ్‌సీలలో కాని చూపించుకోవాలని కోరారు. పెడన పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మీనాదేవి, సీహెచ్‌ఓ ఈఎంఆర్ కుమారి, లీలాకృష్ణ, చేవేంద్ర వైద్యాధికారి ప్రదీప్, సిబ్బంది పాల్గొన్నారు.

బందరు మండలంలో..

కోనేరుసెంటర్: చిన్నాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పలు గ్రామాల్లో మలేరియా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యురాలు నడకుదుటి నాగ నిఖిల మాట్లాడుతూ మలేరియా సోకకుండా ఉండాలంటే పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని చెప్పారు. జ్వరాల బాధితులు వెంటనే రక్త పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు. వైద్యురాలు లుక్కా విజయ కిరణ్ బేడి, ఎంపీహెచ్ఈఓ పరమేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మళ్లీ ముఖ్యమంత్రి జగనన్నే

ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి జోగి రమేష్

గూడూరు: అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంతో లబ్ధిదారులు నిండు మనస్సుతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారని, మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావడం ఖాయమని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. స్థానిక సుమా కన్వెన్షన్ హాలులో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం మంగళవారం జరిగింది. వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు మాతా వెంకట సుబ్బారావును మంత్రి జోగి రమేష్, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళన సమావేశంలో మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు పొందిన ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. అందుకు నిదర్శనం పెడన నియోజకవర్గం తీర ప్రాంతమైనప్పటికి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి సంబంధించి మిస్డ్ కాల్స్ 35 వేలకు పైగా ఉన్నాయన్నారు. ఇదే స్ఫూర్తిలో గృహ సారథులు, సమన్వయకర్తలు మరింత ఉత్సాహంగా గత ప్రభుత్వానికి, జగనన్న ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకువెళ్లాల్సి ఉందన్నారు. విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రబాబు, లోకేష్‌లు సెల్ఫీలతో డబ్బాలు కొట్టుకోవడం తప్ప వారి కార్యక్రమాలకు ప్రజా స్పందన లేదన్నారు. ఎక్కడ చూసినా వారికి ప్రజలు స్వచ్ఛందంగా వచ్చిన సందర్భాలు లేవన్నారు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి చంద్రబాబు అండ్ కో పార్టీకి మింగుడు పడటం లేదన్నారు. మళ్లీ అధికారం వైఎస్సార్ సీపీకే దక్కుతుందనే భయం వారిని వెంటాడుతోందని చెప్పారు. పదవి ఉన్నా లేకపోయినా వైఎస్సార్ సీపీకి, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి విధేయుడనేనన్నారు. మీకు ఏ అవసరం వచ్చినా నన్ను కలిసి సమస్యను పరిష్కరించుకోవచ్చునని పెడన కార్యకర్తలకు హామీ ఇచ్చారు. జోగి రాజీవ్, ఆయూబ్‌ఖాన్, సంగా మధుసూదనరావు, వేముల సురేష్‌రంగబాబు, రవికుమార్, వెంకట్రాజు, రాజబాబు, గంగాధర్, నాగబాబు, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.



వెంకటసుబ్బారావును సన్మానించిన మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్యే వెలంపల్లి తదితరులు

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా జగన్ పాలన

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

కె. కొత్తపాలెం(మోపిదేవి): సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రజలు మరోసారి ముఖ్యమంత్రిగా పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. కె. కొత్తపాలెం గూడెంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరుపై ప్రశ్నలు అడిగి సమాధానాలు నమోదు చేశారు. అనంతరం జగనన్న ఫొటోతో కూడిన స్టిక్కర్లను వారి ఇంటి గోడలపైన, సెల్‌ఫోన్లపైన అంటించారు. మాజీ సర్పంచ్ పాలిమెట్ల వెంకటేశ్వ రరావు, కైతేపల్లి యాకోబు, సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ మత్తి లత, గ్రామ పార్టీ కన్వీనర్ మత్తి రాజాచంద్ పాల్గొన్నారు.

మచిలీపట్నంలో..

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు డివిజన్లలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు మంగళవారం ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ప్రజల అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక తమకు ఎన్నో మేలులు జరిగాయని, జరుగుతున్నాయని మహిళలు వివరించారు.

46వ డివిజన్‌లో కో-ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, సచివాలయ కన్వీనర్ జగన్, 28వ డివిజన్‌లో కార్పొరేటర్ షేక్ షాహీనా, డివిజన్ ఇన్‌చార్జి షేక్ మొహమ్మద్‌సాహెబ్, 50వ డివిజన్‌లో కన్వీనర్ కేశన నాని తదితరులు ఇంటింటికి వెళ్లి కార్యక్రమాన్ని నిర్వహించారు.



లబ్ధిదారులకు బ్రోచర్లు అందిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు, నాయకులు



మచిలీపట్నంలో కరపత్రాలు అందజేస్తున్న కార్పొరేటర్ షాహీనా

గడప గడపకు సంక్షేమ లబ్ధి

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

కోడూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి గడపకు సంక్షేమ ఫలాల రూపంలో లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. రామకృష్ణాపురం సచివాలయ పరిధిలోని ఇరాలి, రామకృష్ణాపురం గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి రమేష్‌బాబు ఆయా గ్రామాల్లోని 505 ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ ఫలాల కరపత్రాలు అందించారు. నాలుగేళ్లలో కుటుంబ సభ్యులకు ఎన్ని సంక్షేమ పథకాలు అందాయి, ఎంత మొత్తం లబ్ధి పొందారో వివరించారు. రమేష్‌బాబు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను ఇంటికే పంపిస్తున్నారని చెప్పారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామాల్లో రహదారులను అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించామని చెప్పారు. గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని పలువురు మహిళలు ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ముందుగా ఇరాలి గ్రామంలోని ఆంజనేయస్వామివారి దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ యాదవ రెడ్డి వెంకటసత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, సచివాలయాల మండల కన్వీనర్ కడవకొల్లు శ్రీనివాసరావు, బీసీ, ఎస్సీ సెల్ కన్వీనర్లు చేబోయిన కృష్ణారావు, వెన్నా ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించం

మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ అన్నారు. మంగళవారం తెల్లవారుజామున ఆమె పలు డివిజన్లలో పర్యటించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. కార్మికులు హాజరు ఎలా వేస్తున్నదీ పరిశీలించారు. అనంతరం రోడ్ల వెంబడి వీధుల్లో ఉన్న కార్మికులతో మాట్లాడి పారిశుద్ధ్య పనులపై సూచనలు ఇచ్చారు. 24, 10, 15, 47 తదితర డివిజన్లలో ఆమె పర్యటించారు. ప్రతి ఇంటి నుంచి చెత్తను క్రమం తప్పకుండా సేకరిస్తున్నారా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రధాన రహదారులు, వీధుల్లో చెత్త ఊడ్చే పనులను పరిశీలించారు. డ్రెయిన్లలో సిల్ట్ తీసి మురుగునీరు సక్రమంగా పారేలా చూడాలని, దోమల నియంత్రణకు డ్రెయిన్లలో ఆయిల్‌బాల్స్ వేయాలని, ప్రతి ఒక్కరు ఆకుపచ్చ, నీలం, ఎరుపు చెత్తబుట్టలను ఉపయోగించాలని చెప్పారు.



పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న మేయర్ వెంకటేశ్వరమ్మ

అయ్యప్పకు పుష్పయాగం



మచిలీపట్నంటౌన్: స్థానిక గాంధీబొమ్మ శివాలయం ఆవరణలోని అయ్యప్ప ఆలయంలో స్వామివారికి మంగళవారం పుష్పయాగం నిర్వహించారు. పలు రకాల పుష్పాలతో స్వామివారికి అభిషేకం జరిగింది. 32వ ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా జరిగిన కార్యక్రమంలో మహిళా భక్తులు పెద్దఎత్తున పాల్గొని నగరోత్సవం నిర్వహించారు.

3న అరుణాచలానికి ఆర్టీసీ బస్సు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం ఆర్టీసీ డిపో నుంచి మే 3వ తేదీన అరుణాచలానికి ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసును ఏర్పాటు చేశామని డీఎం టి. పెద్దిరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తేదీన సూపర్‌లగ్జరీ బస్సు బయలుదేరి 4వ తేదీన కాళహస్తి, కాణిపాకం, శ్రీపురం దేవాలయాలను దర్శించుకుని రాత్రి 11 గంటలకు అరుణాచలం చేరుతుందన్నారు. 5వ తేదీన గిరి ప్రదక్షిణ పూర్తయిన అనంతరం 6వ తేదీ ఉదయం మచిలీపట్నం చేరుతుందని చెప్పారు. బస్సు సర్వీసును బందరు వాసులు వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్: 99592 25462 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల క్రికెట్ టోర్నీ ప్రారంభం

మోపిదేవి: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ప్రారంభమైంది. మోపిదేవి జెడ్పీ పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన పోటీలను మంగళవారం సర్పంచ్ నందిగం మేరీరాణి ప్రారంభించారు. ముఖ్యఅతిథి చల్లపల్లి సీఐ భీమేశ్వర రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండేందుకు క్రీడలు దోహదం చేస్తాయని చెప్పారు. యువతను సక్రమ మార్గంలో పెట్టేందుకు క్రీడలు ఉపయోగపడతాయన్నారు. ఎంకేపీ ఆటో ఫైనాన్స్ నిర్వాహకుడు మలిశెట్టి శ్రీనివాసరావు, శ్రీ సాయి మేఘన చికెన్ సెంటర్ నిర్వాహకుడు, ఎంపీటీసీ సభ్యుడు కారుమూరి శివనాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. యడ్ల ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 33 టీములు నమోదు చేసుకున్నాయని, తొలిరోజు విజయవాడకు చెందిన ఎస్ఎస్‌కే క్రికెట్ అకాడమీ, రేపల్లెకు చెందిన ఫైర్ బాల్స్ జట్లు తలపడగా రేపల్లె జట్టు విజయం సాధించిందని చెప్పారు. మోపిదేవి ఎస్‌ఐ సీహెచ్ పద్మ, పీఈటీ గరికిపాటి మారుతీ, నందిగం అభిషేకరావు, కైలా ఉమామహేశ్వరావు పాల్గొన్నారు.

30న సుబ్రహ్మణ్యేశ్వరుని కల్యాణం

మర్రిపాలెం(నాగాయలంక): మర్రిపాలెం-నంగేగడ్డ గ్రామాల మార్గమధ్యంలోని శివనాగరాజస్వామి ఆలయం 32వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 30వ తేదీన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తామని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త నిజాంపట్నం నరసింహమూర్తి మంగళవారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 27న నంగేగడ్డ, వక్కపట్లవారి పాలెం, మర్రిపాలెం గ్రామాల్లో స్వామివారి గ్రామోత్సవం జరుగుతుందన్నారు.

విద్యతో సామాజిక చైతన్యం

సీనియర్ సివిల్ జడ్జి రామకృష్ణయ్య

చిలకలపూడి(మచిలీపట్నం): గిరిజనులంతా విద్య ద్వారా సామాజిక చైతన్యం సాధించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. 22వ వార్డులోని ముస్తాఖాన్‌పేట దేవునితోట గిరిజన యానాదికాలనీలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా పురోగతి సాధించాలన్నారు. యానాది కుటుంబాలు మత్తుపదార్థాలకు, వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రభుత్వ పథకాలు అందేలా సచివాలయ సిబ్బంది గిరిజనులకు సహకరించాలని చెప్పారు. యానాదులకు కావాల్సిన ధ్రువీకరణ పత్రాల జారీలో రెవెన్యూ అధికారులు చొరవ చూపాలన్నారు. ఉచిత న్యాయ సహాయానికి తమ కార్యాలయం, పారా లీగల్ వలంటీర్లు అందుబాటులో ఉంటారని, అవసరం మేరకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా గిరిజన సంక్షేమ సాధికారత అధికారి ముదిగొండ ఫణిదూర్జటి మాట్లాడుతూ ప్రత్యేక కార్యాచరణ ద్వారా రెవెన్యూ సిబ్బంది సహకారంతో ధ్రువీకరణ పత్రాల జారీకి కృషి చేస్తానన్నారు. అనంతరం గిరిజన విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని వినియోగించుకునేందుకు స్టీలు ప్లేట్లను న్యాయమూర్తి చేతుల మీదుగా అందజేశారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీలి ముసలయ్య, కార్పొరేటర్ ఏకశిరి వెంకటేశ్వరరావు, సచివాలయ కన్వీనర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి రామకృష్ణయ్య

ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్‌గా రామాంజనేయులు

చల్లపల్లి: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కృష్ణా జిల్లా నూతన కన్వీనర్‌గా చల్లపల్లి మండలం వక్కలగడ్డకు చెందిన న్యాయవాది కొల్లూరి రామాంజనేయులు నియమితులయ్యారు. మంగళవారం సాయంత్రం స్థానిక పంచాయతీ పార్కులో ఎమ్మార్పీఎస్ సమావేశం జరిగింది. ముఖ్య వక్తలుగా ఉమ్మడి కృష్ణా జిల్లా ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి లాం డానియేల్, రాష్ట్ర నాయకులు వైఎస్ రాజు, మానికొండ శ్రీధర్ విచ్చేసి జిల్లా, మండల, గ్రామ స్థాయిలో ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా నూతన కన్వీనరుగా కొల్లూరి రామాంజనేయులు, కో-కన్వీనరుగా గన్నవరం నియోజకవర్గానికి చెందిన చోడవరపు వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. కార్యక్రమంలో కనగాల వెంకటరత్నం, కుంపటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

భర్త, అత్తమామల వేధింపులపై ఫిర్యాదు

పెడన: అదనపు కట్నం కోసం భర్త, అత్త, మామలు వేధింపులకు గురిచేస్తున్నారని ఓ మహిళ పెడన పోలీసులకు ఫిర్యాదు చేసింది. పెడన పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెడన తోటమూలకు చెందిన లేళ్ల హవీలా, 18వ వార్డుకు చెందిన ప్రసన్నకుమార్ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరు పామర్రులో కాపురం పెట్టారు. వీరికి కుమారుడు ఉన్నాడు. గత కొంతకాలంగా భర్త లేళ్ల ప్రసన్నకుమార్, అత్త కరుణ, మామ శ్రీనివాసరావులు అదనపు కట్నం తీసుకురావాలంటూ హవీలాను వేధింపులకు గురిచేస్తున్నారు. వేధింపులు తాళలేక ఆమె సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ రవిచంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీచర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ వితరణ

అవనిగడ్డ: స్థానిక భవిత కేంద్రంలోని 51 మంది ప్రత్యేక అవసరాల పిల్లలకు ది టీచర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.17,850 నగదును ఎంఈఓ ఎన్. శివశంకరరావు ద్వారా అందజేశారు. భవిత కేంద్రంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఒక్కొక్కరికి రూ. 350 చొప్పున అందించారు. సొసైటీ అధ్యక్షుడు జీవీఎస్ పెరుమాళ్లు, డైరెక్టర్ వైవీ రత్నారావు, ఉపాధ్యాయులు వాకా వెంకట సుబ్రహ్మణ్యం, భూపతి భాస్కరరావు, అవనిగడ్డ కోటేశ్వరరావు, తోట మాణిక్యాలరావు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

మెరకనపల్లి(మోపిదేవి): మండల పరిధిలోని మెరకనపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం మండల టెక్నికల్ అసిస్టెంట్ ఎన్. హరిబాబు నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలకు, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

పుచ్చగడ్డలో పనులు ప్రారంభం ..

లక్ష్మీపురం(చల్లపల్లి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేదలకు వరమని లక్ష్మీపురం సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం పంచాయతీ పరిధిలోని పుచ్చగడ్డలో గంగాదేవి చెరువు పూడికతీత పనులను ఉపాధి పథకం ద్వారా చేపట్టారు. ఈ పనులను సర్పంచ్ కోటేశ్వరరావు పూజలు చేసి ప్రారంభించారు.